www.methukuseema news
Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం
తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :01 | ఆదివారం | 06 అక్టోబర్ 2024




Published from : Hyderabad,Sanagareddy
పేజీలు :05 వేల :05

# మూసీ బాధితులకు పునరావాసం కల్పిస్తాం




- మూసీ ప్రక్షాళన చేపట్టిన రేవంత్రెడ్డి ప్రభుత్వం
- మూసీ నిర్వాసితులకు కాంగ్రెస్ సర్కారు అండగా ఉంటుందన్న సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ బఫర్ జోన్ లో ఉన్నవాళ్లు ఆందోళన చెందవద్దని సూచన
- సూచనలు, సలహాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలకు విజ్ఞప్తి
- కాకా జయంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ పరీవాహక ప్రాంత నిరుపేదలెవరూ నిరాశ్రయులు కాబోరని, వారందరికీ ప్రత్యామ్నాయం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రివర్ బెడ్, బఫర్ జోన్ లో ఉన్న వారందరికీ మంచి ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఈ విషయంలో కొందరు రెచ్చగొటే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు. స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) 95 వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. వెంకటస్వామిని స్ఫూర్తిగా తీసుకుని నిరుపేదలందరికీ ఒక మంచి జీవితాన్ని, మంచి వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మూసీ పక్కన మగ్గుతున్న నిరుపేదల కోసం మిగతా 2 లో..

# నేను కేసీఆర్ ఫాంహౌస్ వద్ద దీక్ష చేపడతా

- రుణమాఫీ చేయలేదంటూ కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ రావు విమర్శలు
- ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ఎదుట ధర్నా చేస్తానని హెచ్చరిక
- ఏ ముఖం పెట్టుకుని హరీశ్ ఢిల్లీ వెళతాడంటూ జగ్గారెడ్డి ఫైర్




హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : రుణమాఫీ చేయలేదని అదేపనిగా విమర్శిస్తున్న హరీశ్ రావు తమ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటి ఎదుట దీక్ష చేస్తానంటున్నాడని, ఈ పరిస్థితికి కారణం మీరే అని తాను కేసీఆర్ ఇంటి ఎదుట దీక్ష చేపడతానని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రజలను నిండా ముంచాడని, ఇప్పుడు హరీశ్ రావు ఏ ముఖం పెట్టుకుని ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తాడని జగ్గారెడ్డి మండిపడ్డారు. మల్లన్న సాగర్ రైతుల వీపులు పగులగొట్టింది ఎవరు? ఖమ్మం రైతులకు బేడీలు వేసింది ఎవరు?... అప్పుడు హరీశ్ రావు ఏం చేస్తున్నారు? అంటూ నిలదీశారు. రైతుల కడగండ్లకు కేసీఆర్, హరీశ్ రావు చేసిన తప్పులే కారణమని జగ్గారెడ్డి ఆరోపించారు. రుణమాఫీపై చర్చకు తాను సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పిస్తానని. మరి హరీశ్ రావు ఈ చర్చకు కేసీఆర్ ను ఒప్పించి తీసుకురాగలడా? అని ప్రశ్నించారు. సాంకేతిక కారణాల వల్లే కొందరికి రుణమాఫీ జరగలేదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# విమర్శల వార్తలు రాసే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు సరికాదు

## ఆర్టికల్ 19 (1) (ఏ) ప్రకారం జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయి - సుప్రీం కోర్ట్'



సంగారెడ్డి జిల్లా స్టాపర్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వార్తలు రాసిన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టటం ఎంత మాత్రమూ సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విమర్శనాత్మక వార్తలు రాసిన సదరు జర్నలిస్టును అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణను దేశ అత్యున్నత న్యాయస్థానం మంజూరు చేసింది. తనపై ప్రభుత్వం నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం విచారించి.. 'ప్రజాస్వామ్య దేశాల్లో అభిప్రాయాలు వ్యక్తపరిచే స్వేచ్ఛను గౌరవిస్తారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ప్రకారం జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయి' అని సుప్రీంకోర్టు పేర్కొన్నది.జర్నలిస్టులు రాసిన కథనాలను ప్రభుత్వంపై విమర్శలుగా భావించి ఆయా జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని సూచించింది. అలా చేస్తే అది భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని పేర్కొన్నది. అదేవిధంగా జర్నలిస్ట్ అభిషేఖ్ ఉపాధ్యాయ్‌ను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ మంజూరు చేసింది.

# మూసీ బాధితులకు పునరావాసం కల్పిస్తాం



మొదటిపేజీ తరువాయి ప్రణాళికలు తీసుకొస్తోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీనిచ్చారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నగరంలో 12 నుంచి 14 వందల ఫీట్ల లోతుల్లోకి బోరు వేస్తే తప్ప నీళ్లు పడే పరిస్థితి లేదని చెప్పారు. మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ ప్రజలు విషాన్ని దిగమింగుకుని బతుకుతున్నారు. నిరుపేదలను ఆదుకోవడానికి ప్రతిపక్ష నేతల సూచనలు కూడా తీసుకోవడానకి ఒక సమావేశం ఏర్పాటు చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ముఖ్యమంత్రి గారు సూచించారు. ఆనాడు వెంకటస్వామి వేలాది మంది పేదలకు గూడు కల్పించారు. సింగరేణి మూతపడే దశకు చేరుకున్న దశలో దాన్ని కాపాడటానికి ఎంతో కృషి చేశారు. మహనీయుడు వెంకటస్వామి గారు ఆకాంక్షించినట్టు తమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఆదిలాబాద్ కు నీరందిస్తాం. అభివృద్ధిలో ఆదిలాబాద్ తో పాటు పెద్దపల్లి జిల్లాకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం కాకాను సమున్నతంగా గౌరవిస్తూ వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి , గడ్డం వంశీకృష్ణ , అనిల్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం , ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి , గడ్డం వినోద్ , కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు , కేఆర్ నాగరాజు , మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ , సీపీఐ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# బియ్యం ఎగుమతిపై ఫిలిప్పీన్స్ తో చర్చలు జరుపుతున్నాం - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణలో ధాన్యం దిగుబడులు గణనీయంగా పెరిగాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఫిలిప్పీన్స్ దేశానికి తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఇవాళ ఫిలిప్పీన్స్ వ్యవసాయ, ఆహార శాఖ మంత్రి రోజేర్స్ తో ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. గత కొంతకాలంగా భారత్ నుంచి ఫిలిప్పీన్స్ కు బియ్యం ఎగుమతులు జరగడంలేదన్న విషయం ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. నాణ్యతా పరమైన అంశాల కారణంగానే భారత్ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవడంలేదని ఫిలిప్పీన్స్ మంత్రి ప్రస్తావించినట్టు తెలుస్తోంది.దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ... తెలంగాణలో ధాన్యం దిగుబడులు పెరగడమే కాకుండా, బియ్యం నాణ్యత కూడా మెరుగైందని వివరించారు. త్వరలోనే ఫిలిప్పీన్స్ కు తెలంగాణ నుంచి దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు చేసే అవకాశం ఉందని చెప్పారు.

---

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైకేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు



హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతు రుణమాఫీని ఎగ్గొట్టిన ప్రభుత్వం... మూసీలో మురికి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... రైతులను మోసం చేస్తోందని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా విమర్శలు ఎక్కుపెట్టారు."మూసీ వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు? రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? మహిళలకు వంద రోజుల్లోనే నెలకు 2,500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు? అవ్వ, తాతలకు నెలకు 4,000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు? మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రూ. 1,500,000,000 కోట్ల లూటిఫికేషన్ కి తెరతీసిన ఘనుడు ఎవరు? బతుకమ్మ అంటే గిట్టదా.. పట్టదా ఈ ముఖ్యమంత్రికి? ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురావట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా వుంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? బ్లీచింగ్ పౌడర్ కొనడానికి.. చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి పంచాయతీల్లో! రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది? తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం? ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను.. స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు? బతుకమ్మ చీరలను రద్దు చేసారు. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

---

# రుణమాఫీకి తెలంగాణ రైతుల ఎదురుచూపు



హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీ ఇచ్చిందని, ఈనాటికీ అక్కడ రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. కర్ణాటకలో బీజేపీ హయాంలో చేపట్టిన నీటిపారుదల పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. శనివారం మహారాష్ట్రలోని వాషిం జిల్లాలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖకు సంబంధించి రూ. 23,300కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులకు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఉద్దేశించిన సొమ్ములో అవినీతికి పాల్పడుతున్నాయని, రైతుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెసను 'అర్బన్ నక్సల్స్ ముఠా' నడుపుతోందని, ప్రజలు ఐక్యంగా ఉండి ఆ పార్టీ ప్రమాదకర ఎజెండాను తిప్పికొట్టాలన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం బంజారాలను వేధించిందని, బ్రిటీషర్లు దేశాన్ని వదిలివెళ్లిపోయిన తర్వాత ఆ వేధింపులను కాంగ్రెస్ కొనసాగించందన్నారు. బంజారాలను ప్రధాన స్రవంతిలోకిరాకుండా అడ్డుకుందన్నారు. వాషిం జిల్లాలోని పొహారాదేవి గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకున్న బంజారా విరాసత్ మ్యూజియం భవిష్యత్తుతరాలకు బంజారా సమాజం గొప్ప సంస్కృతిని పరిచయం చేస్తుందన్నారు. ఆ గ్రామంలోని జగదాంబ మాత ఆలయాన్ని మోదీ సందర్శించి పూజలు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామారావు మహారాజ్ సమాధులను సందర్శించి నివాళి అర్పించారు. కాగా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత కింద 9.5కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.20వేల కోట్లను ప్రధాని బదిలీ చేశారు.

---

# పశ్చిమ బెంగాల్‌లో మరో దారుణం



హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఆర్జీకర్ ఆస్పత్రిలో మహిళా వైద్యురాలి హత్యాచారం ఉదంతం మరువక ముందే పశ్చిమబెంగాల్‌లో మరో దారుణ ఘటన జరిగింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో కనిపించకుండాపోయిన పదేళ్ల బాలిక మృతదేహం శనివారం లభ్యం కావడం సంచలనంగా మారింది. ఈ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాలుగో తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి రాలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసిన సరిగా స్పందించలేదని బాలిక కుటుంబసభ్యులు ఆరోపించారు. అయితే, శనివారం తెల్లవారుజామున జయ్‌నగర్ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో వారు కోపోద్రిక్తులై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ మహిస్మరి పోలీస్ ఔట్‌పోస్టుకు నిప్పుపెట్టారు. నిరసన ప్రదర్శన చేశారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

---

# ప్రధాని మోదీకి బంజారా మహిళల అపూర్వ స్వాగతం



మహారాష్ట్ర,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : మహారాష్ట్రలో పర్యటిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. వాషిమ్ చేరుకున్న ఆయనకు సాంప్రదాయ రీతిలో మహిళలు ఘన స్వాగతం పలికారు. మహారాష్ట్ర పర్యటన సందర్భంగా రూ.56,000 కోట్లకు పైగా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ముందుగా వాషిమ్‌కు వెళ్లిన మోదీ అక్కడ బంజారా హెరిటేజ్ మ్యూజియాన్ని ప్రారంభించారు. దీని తరువాత, అతను పోహ్రాదేవిలోని జగదాంబ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామ్‌రావ్ మహారాజ్ సమాధుల వద్ద నివాళులర్పించారు. అనంతరం థానేలో రూ.32,800 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.అంతకుముందు పోహ్రాదేవిలోని జగదాంబ మాత ఆలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. వాషిమ్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామ్‌రావ్ మహారాజ్ సమాధి వద్ద ఆయన నివాళులర్పించారు. పోహ్రాదేవి మహారాష్ట్రలోని ప్రధాన మతపరమైన ప్రదేశాలలో ఒకటి. బంజారా కమ్యూనిటీ యొక్క గొప్ప వారసత్వాన్ని తెలిపే ఐదు అంతస్తుల బంజారా హెరిటేజ్ మ్యూజియాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ నవరాత్రుల పవిత్ర సమయంలో 18వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని విడుదల చేసే అవకాశం ఇప్పుడే లభించిందని అన్నారు. దేశంలోని 9.5 కోట్ల మంది రైతుల ఖాతాలకు రూ.20 వేల కోట్లకు పైగా నగదు బదిలీ అయ్యాయన్నారు. మహారాష్ట్రలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం మహారాష్ట్ర రైతులకు రెట్టింపు ప్రయోజనాలను అందిస్తోంది. నమో షెత్కారీ మహాసమ్మన్ నిధి యోజన కింద మహారాష్ట్రలోని 90 లక్షల మందికి పైగా రైతులకు సుమారు రూ.1900 కోట్లు అందించామన్నారు ప్రధాని మోదీ.సంచార, పాక్షిక సంచార వర్గాలకు సంక్షేమ బోర్డును కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సమాజంలోని సంస్కృతికి సరైన గుర్తింపునిచ్చేందుకు బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వాలు ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఆలోచన మొదటి నుంచీ పరాయిదే. బ్రిటిష్ పాలనలా ఈ కాంగ్రెస్ కుటుంబాలు కూడా దళితులను, వెనుకబడిన తరగతులను, గిరిజనులను తమతో సమానంగా పరిగణించడం లేదని ధ్వజమెత్తారు. భారతదేశాన్ని ఒకే కుటుంబం పాలించాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో ఎప్పుడూ బంజారాల పట్ల అవమానకరమైన వైఖరిని కొనసాగించారని మోదీ ఆరోపించారు.బంజారా హెరిటేజ్ మ్యూజియంపై అందరికీ అభినందనలు తెలియజేశారు ప్రధాని మోదీ. బంజారా సమాజం భారతదేశ సామాజిక జీవితంలో, భారతదేశ నిర్మాణ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిందన్నారు. బంజారా సమాజం భారతదేశ ఆధ్యాత్మిక చైతన్యానికి అపారమైన శక్తిని అందించి, ఎందరో సాధువులను అందించిందని గుర్తు చేశారు. తరతరాలుగా, వందల వేల సంవత్సరాలుగా, ఈ సంఘం భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, పెంపొందిస్తూ వచ్చిందన్నారు.ప్రధాని మోదీ ఈరోజు నవరాత్రుల సందర్భంగా ఆలయంలో మాతా జగదాంబ ఆశీస్సులు పొందే భాగ్యం కలిగిందని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామ్‌రావ్ మహారాజ్‌ల సమాధిని కూడా సందర్శించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ ఇద్దరు మహానుభావులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నన్నారు మోదీ.. అంతకుముందు, ప్రధాని మోదీ శనివారం ఉదయం నాందేడ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ బీజేపీ నాయకుడు అశోక్ చవాన్ ఆయనకు స్వాగతం పలికారు. ఇది మహారాష్ట్రలో ప్రధాని ఒకరోజు పర్యటన.నాందేడ్ నుంచి హెలికాప్టర్‌లో పోహ్రాదేవికి వెళ్లారు. వాషిమ్ తర్వాత, అతను థానే, ముంబైలను సందర్శించారు. అక్కడ అతను అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి వ్యవసాయం, శుపోషణకు సంబంధించిన చేపట్టిన అనేక 23,300 కోట్ల రూపాయల విలువైన పథకాలను ప్రారంభిస్తాంచారు. రైతులకు సాధికారత కల్పిస్తామని తన వాగ్దానంలో భాగంగా, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 18వ విడత రూ. 20,000 కోట్లను సుమారు 9.4 కోట్ల మంది రైతులకు ప్రధాని పంపిణీ చేశారు. ఈ 18వ విడతతో ఇప్పటివరకు రైతులకు మొత్తం రూ.3.45 లక్షల కోట్లు పంపిణీ చేశారు.రూ.1,920 కోట్ల కంటే ఎక్కువ విలువైన వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎఫ్) కింద 7,500కు పైగా ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు. వీటిలో ప్రధానంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీ మరియు పంట అనంతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రాజెక్టులు ఉన్నాయి. 1,300 కోట్ల టర్నోవర్‌తో 9,200 రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (%ఫీూూ%) కూడా ప్రధాని జాతికి అంకితం చేశారు. స్వదేశీ లింగ క్రమబద్ధీకరించిన వీర్యం సాంకేతికతను కూడా ప్రారంభించారు. రైతులకు సరసమైన ధరలకు లింగ-విభజన చేసిన వీర్యాన్ని అందించడం, దాని ధరను ఒక్కో మోతాదుకు దాదాపు రూ. 200కి తగ్గించడం ఈ చొరవ లక్ష్యం. ఆవుల కోసం "గౌచిప్", గేదెల కోసం "మహిషాచిప్" జన్యురూప సేవలతో పాటు అభివృద్ధి చేశారు. దీని ద్వారా జెనోమిక్ సెలక్షన్ ద్వారా మంచి నాణ్యమైన ఎద్దులను చిన్నవయసులోనే గుర్తించవచ్చు. ఇది కాకుండా, మహారాష్ట్రలో 'ముఖ్యమంత్రి సౌర్ క్రుషి వాహిని యోజన %-% 2.0' కింద 19 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు సోలార్ పార్కులను కూడా ఆయన జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన 'ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహిన్ యోజన' లబ్ధిదారులను కూడా సత్కరించారు.

---

# ఒకే కుటుంబంలో ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్



హైదరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. అన్ లైన్ బెట్టింగ్ ద్వారా కుమారుడు చేసిన అప్పులు తీర్చలేక దంపతులు సహా వారి కుమారుడు బలవన్మరణం చెందారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో ఈ దారుణ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సురేశ్ (53), హేమలత (45), వారి కుమారుడు హరీశ్ (22) ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

# బిజెపి మహా సభ్యత్వ నమోదు కార్యక్రమం



గుమ్మడిదలలో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మండల అధ్యక్షులు పలుగు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బిజెపి మహా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల ప్రజలు యువకులు ప్రతి ఒక్కరూ బిజెపి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిణామాలను అరికట్టాలంటే కేవలం బిజెపితోనే సాధ్యమవుతుందని తెలిపారు కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు గిద్దె రాజు, మాజీ మండల అధ్యక్షులు నర్సంపల్లి రాజిరెడ్డి, చింతల యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, భాస్కర్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సృజనలక్ష్మి, కిసాన్ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ రాఘవరెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు కావలి ఐలేష్, భూత అధ్యక్షులు సాయిరాంరెడ్డి, యాదగిరి, మురళి చారి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

---

# బాధితుని కుటుబానికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



సిద్దిపేట జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : సిద్దిపేట జిల్లా,దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లపూర్ రెండవ వార్డ్ లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మెరకు రెండవ వార్డ్ కౌన్సిలర్ గొనేపల్లి దేవలక్ష్మి- సంజీవరెడ్డి రెండవ వార్డ్ కు చెందిన బాధితుడు మద్దికుంట రాజయ్య (కీర్తిశేషులు ఎనగుర్తి రాజయ్య)ల కుటుంబ సభ్యులకు 60,000 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు.కౌన్సిలర్ మాట్లాడుతూ పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ పథకం చాలా ఉపయోగకరంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో వార్డ్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడుదుబ్బాక రవి,మద్దికుంట నర్సింలు,రాజు,దుర్గయ్య,మల్లయ్య, పోషయ్య,కనకయ్య మరియు తదితులున్నారు.

---

# భవిత జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు





సదాశివపేట,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో శనివారం నాడు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి, సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, కుమారి జయ రెడ్డి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అతిథులుగా రావడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను నిర్వహిస్తున్న కళాశాల యజమాని అని అభినందించారు. ఐపిఈ మార్చ్ -2024లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధాన స్థలం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ బాలరాజు, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రాజు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాల అనంతరం అందంగా అలంకరించిన బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయక సాగర్ లో నిమజ్జనం చేయడం జరిగింది.

---

# ఈసోజీపేట గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి





పుల్కల్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : మండల పరిధిలోని ఇసోజి పేట గ్రామాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి శనివారం నాడు అట్టి గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆమె చిన్నగా పరిశీలించారు అంతేకాకుండా గ్రామంలో పలు వార్డులలో తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె స్వయంగా గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే లో భాగంగా ఆమె గ్రామంలోని అన్ని వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆమె అన్నారు అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను నిజమైన లబ్ధిదారులకు చేరే విధంగా చూస్తామని ఆమె గ్రామ ప్రజలకు తెలిపారు పుల్కల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ సోజీపేట గ్రామాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు కావున ఇట్టి సౌకర్యాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె గ్రామ ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల పలు శాఖల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సి ఐ ఈ ఆటోమోటివ్ పరిశ్రమలో సిఐటియు ఘనవిజయం





సదాశివపేట,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సి ఐ ఈ ఆటోమోటివ్ పరిశ్రమలో సిఐటియు ఘన విజయం సాధించడం జరిగిందని యూనియన్ అధ్యక్షులుగా బీరం మల్లేశం గెలవడం జరిగింది. ఈ సందర్భంగా సదాశివపేట అంబేద్కర్ విగ్రహం దగ్గర యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేశంకు సదాశివపేట సి ఐ టి యూ నాయకులు ఘన స్వాగతం పలుకుతూ పూలమాలతో సత్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో సీఐఈ ఆటోమేటిక్ పరిశ్రమలో సి ఐ టి యూ నో గెలిపించిన కార్మికులకు అభినందనలు తెలియజేశారు ఈ పరిశ్రమలో మొత్తం కార్మికులు 69 మంది ఉంటే 53 ఓట్లు సిఐటి కు రావడం జరిగింది కేవలం 16 ఓట్లు మాత్రమే ఇతర యూనియన్ కు రావడం జరిగింది అన్నారు మెజార్టీ కార్మికులు మొత్తం సిఐటియు ఆదరించడం జరిగింది అన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమలలో కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరంగా పోరాటాలు నిర్వహిస్తుంది అన్నారు. అనేక పరిశ్రమల్లో మంచి వేతన ఒప్పందాలు కార్మికుల సౌకర్యాలు ఇప్పించడంలో సిఐటియు అగ్రభాగాన ఉంటుంది అన్నారు నన్ను ఆదరించిన సదాశివపేట సిఐటి కార్మికులకు నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ సిఐటియు నాయకులు ఎన్ శ్రీనివాస్ వి శ్రీనివాస్, రమేష్ గౌడ్, భూషణం, గోపాల్ రాజు నర్సింలు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

---

# డి ఆర్ డి ఏ కార్యాలయ ప్రాంగణములో బతుకమ్మ వేడుకలు

## - ముఖ్య అతిథిగా హాహాజరైన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు







సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా సమైక్య ఆధ్వర్యంలో పాత డి ఆర్ డి ఏ కార్యాలయ ప్రాంగణములో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ బతుకమ్మ వేడుకలకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బతుకమ్మను ఎత్తుకొని, ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మ ఆడారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తికి ఎంతగానో ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి, వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని అన్నారు . ఇందులో భాగంగా గ్రామీణ మహిళలు ఆర్థికంగా ముందుకు రావాలని, ప్రభుత్వ పథకాల ఉపయోగించుకోవాలని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించడంలో మహిళల భాగస్వామ్యం ఎంతగానో అవసరమని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. మహిళలు తమ సామర్థ్యాలను ఉపయోగించుకొని, స్వయం ఉపాధి కల్పించుకోవడానికి దిశానిర్దేశం చేయాలని అన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాలు మండల స్థాయిలో తమ స్వంత పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని, వీటికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆమె తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చాలా ముఖ్యమని ఆమె అన్నారు . బతుకమ్మ వంటి పండుగలు మహిళా శక్తిని ప్రదర్శించడానికి, సామాజిక ఐక్యతను మరింతగా పెంపొందించడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తుందని, ఇది ఒక దశాబ్దకాలంగా ప్రత్యేక సంస్కృతిని కలిగిన పండుగగా నిలిచిందని ,బతుకమ్మను గొప్ప ఉత్సవంగా నిర్వహించడం ద్వారా మహిళలు, కుటుంబాలు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటును అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు .మహిళల కు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరాలను అందించారు. మహిళలు బతుకమ్మ వంటి పండుగల ద్వారా తమ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవడమే కాకుండా, ఆర్థికంగా బలపడటానికి తగిన అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళల శక్తి ద్వారా సొసైటీలో మార్పు తీసుకురావచ్చు. తెలంగాణ మహిళా సంఘాలు, ఇతర ప్రాంతాల మహిళలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతీ గ్రామంలో పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేయడమే గాక, మహిళలు వాటి నిర్వహణలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ఇది గ్రామీణ అభివృద్ధికి ముఖ్యమైన దిశగా పయనమౌతుందని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా మహిళల సామర్థ్యాన్ని ప్రదర్శించే ఈ పండుగలో పాల్గొనడం తమకు చాల సంతోషంగా ఉందని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.ఈ వేడుకల్లో పి డి డి.ఆర్.డి.ఓ.జ్యోతి , ఏ పి ఓ లు, జిల్లా మహిళా శక్తి సంఘ సభ్యులు , వివిధ మండలాల మహిళలు హాజరయ్యారు.

---

# సంగారెడ్డి లో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గ స్థాయి 150 ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక పురస్కారాలను సంగారెడ్డి పోతిరెడ్డి పల్లి చౌరస్తా పి ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేతల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు.ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ నాకు కొంత ఆరోగ్యం బాగోలేకున్న నిండు మనసుతో ఆశీర్వదించిన మీకు శిరస్సు వంచి పాదాభివందనం... ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉపాధ్యాయులను సత్కరించుకోవడం సంతోషంగా ఉంది... విద్యార్థులను దేశం గర్వించే విధంగా తీర్చిదిద్దాలి.. భారతదేశ ఖ్యాతిని మరింత పెంచే విధంగా అన్ని వృత్తులో రాన్నించుకొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు శిరసు వంచి నమస్కారాలు అని అన్నారు.రాజకీయ నాయకున్ని మెచ్చుకునే వాళ్ళు ఉంటారు, విమర్చించే వాళ్ళు ఉంటారు...ఉపాధ్యాయునికి విమర్శించే వాళ్ళు ఉండరు... ఉపాధ్యాయుల సమస్యలను , హక్కుల సాధనలో న్యాయ పరమైన కోరికలు చట్టపరమైన ఇవ్వాల్సిన హక్కుల విషయంలో మీ వెంట ఉండి మీ హక్కుల సాధనకు కృషి చేస్తా..ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, ప్రభాకర్,నర్సింలు, విట్టల్,శ్రీధర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి,వివిధ మండలాల ఎంఈఓ లు, వివిధ ఉపాధ్యాయ సంఘ నేతలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహంకాళి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు

- మహంకాళి గుడి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరైన పృథ్వీరాజ్ , శాలువతో సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు.





పటాన్ చెరువు,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : పటాన్ చెరువు పట్టణంలో గల మహంకాళి ఆలయంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు పటాన్చెరు పట్టణంలో సన్మాన కార్యక్రమంలో భాగంగా పృథ్వీరాజ్ గారికి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేయడం జరిగింది. పృథ్వీరాజ్ గారు అమ్మవారిని దర్శించి తన రాజకీయ భవిష్యత్తుకు దేవుడి కృప ఉండాలని కోరానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ సపానదేవ్, ప్రకాష్ రావు, కార్పొరేటర్ కుమార్ యాదవ్, బసవయ్య, మాణిక్ ప్రభు, చంద్రశేఖర్ రెడ్డి, నర్రా బిక్షపతి, జగన్ ముదిరాజ్ , ధనరాజ్ గౌడ్, చందు , దయానంద్ చారి తదితరులు పాల్గొన్నారు.

---

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



గజ్వేల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : మర్కుక్ మండలం వరదరాజ్ పూర్ గ్రామానికి చెందిన సాధమైన చందన కు గత ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగింది. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి చెక్కు రూపంలో విడుదల అయినా నిధులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనకయ్య గౌడ్ వరదరాజ్ పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కృష్ణయ్య కాంగ్రెస్ నేతల సమక్షంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనకయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని నిరుపేదల బాగోగుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంతని ప్రభాకర్, మరియు సీనియర్ నాయకులైన బ్రహ్మానంద రెడ్డి, రవీందర్ రెడ్డి, గొడుగు బాపురాజు, మాచర్ల సిద్దేశ్వర ,పిట్టల మోహన్, పలుగుల కిషన్, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అయినటువంటి అంతని వెంకటేష్ సాధమైన కైలాసం, వట్టిపల్లి భూషణం , బోల ప్రభాకర్, బొల్లారం రవి ,అంతర్ నరేష్ ,మీసాల మధు ,పొన్నాల శేఖర్, రెడ్డమైన అనిల్, బోళ్ల అశోక్ ,బోల బాలరాజు, కొండ వెంకటేష్, రెడ్డమైన రాములు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

---

# యూనికాన్ బైక్ టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఢీ వ్యక్తి మృతి



గుమ్మడిదల,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : యూనికాన్ బైక్ టీవీఎస్ ఎక్సెల్ వాహనదారులు సుమారు ఉదయం 04:30 గంటలకు ఉద్యోగ రిత్య బయలుదేరుతున్న సమయంలో అనువార్య కారణాలవల్ల రెండు వాహనాలు ఢీకొని టీవీఎస్ వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం పరిసర ప్రాంతాలలో చోటుచేసుకుంది ఇట్టి విషయమై ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జిన్నారం గ్రామానికి చెందిన కొరబోయిన దుర్గయ్య 56 ఉదయం 4:30 సమయంలో ఉద్యోగానికి వెళుతున్న క్రమంలో జంగంపేట నివాసి యూనికాన్ బైక్ పై తాను ఉద్యోగరీత్యా డప్పు సాయికుమార్ 29 వెళ్తున్న క్రమంలో రెండు వాహనాలు ఢీకొనడంతో కోరబోయిన దుర్గయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుమారుడు కొరబోయిన నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

---

# సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

- అప్రమత్తమైన అధికారులు
- అట్టి నీటిని రెండు గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న సంబంధిత అధికారులు





పుల్కల్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు అట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29. 917 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులోకి ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై శనివారం నాడు మధ్యాహ్నం సింగూరు ప్రాజెక్టు 11వ గేటు మరియు ఆరో గేటు రెండు గేట్ల ద్వారా19.985 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు దీంతో దీంతో మాంజీర పర్యాయక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు తెలుపుతున్నారు ఒకవేళ మత్స్యకారులు కానీ గొర్ర కాపరులు పశు కాపరులు మంజీరా నది వైపు వెళ్ళవద్దని ప్రాజెక్టు అధికారులు తెలిపారు దీంతో నేటి ప్రవాహం ఎక్కువ కావడంతో మంజీరా పరిహాక ప్రాంతాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా అధికారులతో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష











సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఖరీఫ్ 2024-25 సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంగారెడ్డి కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య మాత్యులు దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, పోలీస్ శాఖ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన వ్యూహాలను సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను నిష్కంటకంగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు కలెక్టరేట్ అధికారులకు స్పష్టం చేశారు. సన్నధాన్యం, దొడ్డుధాన్యానికి విడివిడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో సూపర్ ఫైన్ రకానికి క్వింటాలుకు రూ.2320 మరియు కామన్ వెరైటీకి రూ.2300 ధరను నిర్ధారించింది. అదనంగా సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి, రైతులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గన్నీ బ్యాగులు, రవాణా వాహనాలు సమయానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు చేరేవరకు అధికారులు పూర్తిగా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుండి సన్న రకం ధాన్యం రవాణా కాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, కొనుగోలు చేసిన ధాన్యం కోసం రైతులకు 48 గంటల్లోగా డబ్బులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో రెవిన్యూ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, పోలీసులు, సహకార శాఖ, ఐకెపి, రవాణా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, ట్రై నీ కలెక్టర్ మనోజ్ , పి డి డి ఆర్ డి ఏ జ్యోతి , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ , డిఎం సివిల్ సప్లై కొండలరావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# గడ్డం వెంకటస్వామి కాకా కు ఘన నివాళి

## - మంత్రి దామోదర్ రాజనర్సింహ







సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య మాత్యులు దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, గడ్డం వెంకటస్వామి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించి, సామాజిక సంక్షేమానికి అంకితమై సేవ చేసిన నాయకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. గడ్డం వెంకటస్వామి రాజకీయ జీవితం పేద ప్రజల సంక్షేమానికి అంకితమైనదని, దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి, చేపట్టిన చర్యలు ఎన్నో జీవితాలకు మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు . పేదలకు న్యాయం జరిగేలా అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి, దేశంలోని దళిత, నిరాదరణలో ఉన్న ప్రజలకు ఆశాజ్యోతి నిచ్చిన నాయకుడు అని అభివర్ణించారు. గడ్డం వెంకటస్వామి విద్య, ఉద్యోగ రంగాల్లో చేసిన సంస్కరణలు ఇప్పటికీ అమలులో ఉంటున్నాయని, వాటి ఫలితంగా అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు లాభపడుతున్నారని మంత్రి అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ప్రజల కష్టసుఖాలను తీర్చేందుకు చేసిన కృషి మరపురానిదని ఆయన పేర్కొన్నారు. పేదల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం ఆయన అహర్నిశలు శ్రమించిన నాయకుడని, ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాల అని మంత్రి అన్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడానికి గడ్డం వెంకటస్వామి చేసిన కృషి స్ఫూర్తిగా ఉంటుందని ఆయన అన్నారు. గడ్డం వెంకటస్వామి చూపిన మార్గం, ఆయన ఆశయాలు ఇప్పటికీ సమాజానికి అవసరమైనవి అని, యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని మంత్రి అన్నారు. అందరికీ సమాన హక్కులు కల్పించడానికి గడ్డం వెంకటస్వామి చేసిన కృషి చేసారని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్ఓ పద్మజ రాణి , జిల్లా అధికారులు, సంబంధిత శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే

- మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి....
- ఉజ్వల కళాశాల ఫ్రెషర్స్ పార్టీ లో పట్టణ సీఐ మహేష్ గౌడ్.







సదాశివపేట,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : ఉజ్వల భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోని ఉందని మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండి కష్టపడి ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సదాశివపేట పట్టణ సీఐ మహేష్ గౌడ్ అన్నారు. శనివారం నాడు ఉజ్వల కళాశాల ఫ్రెషర్స్ పార్టీ కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో చదువుతోనే సంస్కారం ఏర్పడుతుందని కష్టపడి ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారు అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలైన మాదకద్రవ్యాలు గంజాయి,సిగరెట్లు వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అన్నారు. మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదువు నేర్పిస్తున్నారని, చదువులు నేర్పే గురువులను, తల్లితండ్రులను గౌరవించి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయి మార్కులు సాధించాలన్నారు. తదుపరి విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిభావంతులకు గోల్డ్ మెడల్స్, మెడల్స్ తో పాటు మెమొంటోళ్లను సీఐ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జీనియస్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రణీత రెడ్డి, ముద్ద నాగనాథ్.,వైస్ ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి, కరస్పాండెంట్ పోల వెంకటేశం రెడ్డి డైరెక్టర్ రఘువరన్ రెడ్డి లెక్చరర్లు నర్సింలు, ప్రవీణ్,చంద్రశేఖర్, రంగయ్య సంగమేశ్వర్ రెడ్డి,నరేష్,సునీత ప్రియాంక, వరలక్ష్మి, మమతా వైష్ణవి, రాజు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

---

# బురదమయంగా రత్నాపూర్ మల్గి రోడ్డు



న్యాల్కల్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో ని న్యాల్కల్ మండలం గల రత్నపూర్ మల్గి వెళ్లే దారి చాలా దారుణంగా మారిపోయింది హాస్పిటల్కి వెళ్లాలనుకుంటే చానా ఇబ్బంది పడుతున్నారు ఈ రోడ్డు కొరకు పట్టించుకునే నాయకుడు కరువుఅయ్యారు గత పది సంవత్సరాల క్రితం సురేష్ శెట్కార్ చేసిన రోడ్డు మళ్లీ ఇ రోడ్డు వైపు ఏ అధికారి అయినా కానులెత్తి చూడలేదు ఈ రోడ్డు మొత్తం నీటిమాయంగా మారడంతో గుంతలు గడ్డలు తెలియడం లేదు దీనితో ప్రయాణికులు వాహనాల పై నుండి నీటిలో పడిపోతున్నారు ద్విచక్ర వాహనా దారులు నానా తంటలు పడుతున్నారు అటుగా వెళ్లి వాహనులు నీటిలోనుండి వెళ్లడంతో అనీరు ద్వీచ్చక్ర ఆడుతున్నాయి రోడ్డు పూర్తిగా చిన్న చెరువును తలపించుడంతో వాహన దారులు ఎటు నుండి వెళ్లాలో తెలియడం లేదు రెండు గ్రామలా రోడ్లు పూర్తిగా ద్వాంసం అవడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబందులు ఎదురు కుంటునారు త్వరగా రెండు గ్రామాల రోడ్లు మంజూరు చేసి పనులు ప్రారంభించలని ఆ గ్రామస్తులు కోరుకుంటున్నారు లేదంటే మండలం లోని ఏం పి డి ఓ.. కార్యాలయం ముందర దీక్ష చెప్పడతామణి రత్నపూర్ మల్గి గ్రామస్థులు ప్రభుత్వనికి హెచరించారు ఇ కార్యక్రమం లో.విజయ్ కుమార్.గౌతమ్ లాజర్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

---

# నిరుపేదలకు నిత్యవసరం సరుకులు అందించిన గుబ్బప్ప మచ్చేందర్ ఫౌండేషన్



నారాయణఖేడ్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట మండలంలోని కట్టెల వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేకల శైలజ నిరుపేద ఒంటరి మహిళలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించి వారికి అన్నివేళలా అండగా ఉంటానని ధైర్యాన్ని ఇచ్చిన గుబ్బప్ప మచ్చేందర్ ఫౌండేషన్ ఇట్టి కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ సాగర్, సంతోష్ నాయక్,తాజా మాజీ ఉపసర్పంచ్ నారాయణ, వార్డ్ మెంబర్ మొగులమ్మ, మండల నాయకులు అరుణ్ కుమార్ , మాజీ వార్డ్ మెంబర్ గువ్వ నారాయణ, నాగయ్య, నరసయ్య, లింగం, మహేష్, శంకరయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

---

# నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

- మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్



జహీరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వారు మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి రూపంలో డబ్బుల అందించడం జరుగుతుందని, నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని మాజీ ఐడిసి చైర్మన్ మోహమ్మద్ తన్వీర్ అన్నారు. శనివారం నాడు మధ్యాహ్నం తన స్వగృహంలో కోహిర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కోహిర్ ఎంపిటిసి.2 హన్నాన్ జావిద్ తో కలిసి సుమారు 1 లక్ష 50 వెయ్యిల విలువైన చెక్కుకను అందించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, వైద్య మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ డా చంద్రశేఖర్, మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు జలీల్ అహేమద్, నాయకులు యూసుఫ్ పటేల్, లబ్ధిదారులు ఉన్నారు.

# భవానీ భజన మండలి వారి ఆహ్వానం మేరకు




సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : దేవి శరన్నవరాత్రుల సందర్భంగా భవానీ మందిరం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భవానీ భజన మండలి అధ్వర్యంలో నిర్వహించిన భక్తి భజన సంకీర్తనల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం భజన మండలి వారికి సన్మానం చేసి, నృత్యాలు చేసిన చిన్నారులకు బహుమతులను అందజేసిన శాసనసభ్యులు శ్రీ కోనింటీ మాణిక్ రావు,వారితో పాటు గా శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయ మాజి చైర్మన్ నీల వెంకటేశం ,ఆత్మ చైర్మన్ పెంట రెడ్డి ,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మాజి మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్ శేరి ,ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం , నాగరాజ్ తదితరులు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ దుర్గ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఆ మాత అషిషులతో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని ,ప్రతి సంవత్సరం లాగే ఇట్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందలు తెలియజేశారు.

---

# పెద్ద శంకరంపేట ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో





మెదక్ జిల్లా,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : పెద్ద శంకరంపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రిల సందర్భంగా అన్నపూర్ణాదేవి అలంకరణలో పూజలు అమ్మవారికి నిర్వహించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు,వచ్చి తీర్థప్రసాదాలు తీసుకొని అమ్మవారి ఆశీర్వాదం పొంది. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పట్టణ ఆర్యవైశ్య సంఘం మరియు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగింది.

---

# దేవి నవరాత్రి ఉత్సవల్లో పాల్గొన్నజి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ గుబ్బప్ప మచ్చేందర్



కంగ్టి,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : కంగ్టి మండల్ ఎంకెమూరి గ్రామం లో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి కార్యక్రమానికి ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నేడు జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ గుబ్బప్ప మచ్చేందర్ గారు దేవి నవరాత్రి పూజలో పాల్గొన్నారు తదుపరి ఉత్సవ కమిటీ సభ్యులు గుబ్బప్ప మచ్చేందర్ గారిని మరియు జి ఎం ఆర్ ఫౌండేషన్ సభ్యులను ఘనంగా సన్మానిచ్చారు. వారితో పాటు జి ఎం ఆర్ ఫౌండేషన్ సభ్యులు నారాయణఖేడ్ ఏ ఎమ్ సి మాజీ వైస్ చైర్మన్ ఎం ఏ బసిత్, నాగల్గిద్దా మాజీ వైస్ ఎం పి పి పండరి యాదవ్, సీతారామ్ తాండ తాజా మాజీ సర్పంచ్ రాజు నాయక్, నారాయణఖేడ్ గీతా సహకార సంగం డైరెక్టర్ శంకర్ గౌడ్, గుబ్బప్ప శ్రీనివాస్, పండరి ముదిరాజ్ మరియు మారుతీరెడ్డి, సంతోష్ రెడ్డి, పండరి రెడ్డి, హన్మంత్ రెడ్డి,వెంకట్ రెడ్డి,రాజు పటేల్, జైపాల్ రెడ్డి, ఎంకెమూరి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

# జహీరాబాద్ లో బిజెపి మహా సభ్యత్వ నమోదు



జహీరాబాద్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : జహీరాబాద్ పట్టణ పరిధిలోని వివిధ వార్డులలో బిజెపి నాయకులు ఆధ్వర్యంలో శనివారం బిజెపి మహా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణం లోని అన్ని వర్గాల ప్రజలు యువకులు ప్రతి ఒక్కరూ బిజెపి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిణామాలను అరికట్టాలంటే కేవలం బిజెపితోనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గొల్ల భాస్కర్,.సుభాష్ రెడ్డి. అరుణ కుమార్, ఓబిసి నాయకులు సురేష్ పూరి.మరియు మరియు ముఖ్య నాయకులు మహిళా నాయకులు వివిధ మండల అధ్యక్షులు మున్సిపల్ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జులు బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

---

# దెగుల్ వాడి గ్రామంలో దుర్గామాతని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి



నారాయణఖేడ్,అక్టోబర్ 06 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం దెగుల్ వాడి గ్రామం లోని దుర్గా భవాని మాత ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు అయినా దేవి అలంకరణలో దుర్గామాతని దర్శించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న పి సి ఆర్. ఈ కార్యక్రమంలో పాటు రాహుల్ రెడ్డి. మంచుకూరి సురేష్. కుపేందర్ రెడ్డి. కుశల్ రావ్ దేశాయ్.ధాను దేశాయ్. గోరక్ నాథ్. సతీష్ మచుకూరి. బూరె లక్ష్మణ్. బి రాజు. జె.శంకర్.శర్నప్ప. ఆర్ శివరాం, తదితర భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com